క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మండల పరిధిలోని మేడిపల్లి, వీరన్నపేట గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చిలుకూరు సెక్షన్ ఏఈ శివరామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొద్దటూరు సబ్‌స్టేషన్ పరిధిలోని మేడిపల్లి, వీరన్నపేట 11కేవీ ఫీడర్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, ఆయా గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు ఉపాధి పనుల సామాజిక తనిఖీ

ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై బుధవారం సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సంధ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ ఉంటుందన్నారు. ఈ తనిఖీ బృందం మండల పరిధిలోని 28 గ్రామాల్లో ఈ నెల 6 నుంచి 10 వరకు చేపట్టిన తనిఖీలు చేపట్టారని.. వారు పరిశీలించిన అంశాలను బుధవారం మధ్యాహ్నం 2గంటలకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, ప్రొసీడింగ్ అధికారి ఎదుట సమర్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజలు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం



బిడ్డను కుటుంబసభ్యులకు అందిస్తున్న సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో అనిత(22) సంవత్సరాల గర్భిణీకి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది వచ్చి ఆమెను అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా అదే గ్రామంలో అనిత అంబులెన్స్ వాహనంలోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఏఎన్ఎం సహకారంతో అంబులెన్స్ సిబ్బంది డెలివరీ చేశారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వారిని అభినందించారు. అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్, నర్సింలు, ఏఎన్ఎం, కుటుంబ సభ్యులు ఉన్నారు.

దీన్ దయాల్ సేవలు మరువలేనివి



దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్ల: దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన దార్శనికుడు, జాతీయవాది పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అని బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో దీన్ దయాల్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ జన్ సంఘ్ కీలక నాయకుడిగా ఆయన చేసిన కృషి దేశంలో ఆధునిక జాతీయ వాద రాజకీయ ఆలోచనకు పునాది వేసిందన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలకు కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, అభిలాష్‌బాబు, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రకాశ్, హర్షిత్, దామోదర్, తిప్నేత, శేఖర్ ఉన్నారు.

'రైతుదీక్షల పేరుతో కాలక్షేపం'

కుల్కచర్ల: రైతుదీక్షలు, ఆరోపణలతో కాలక్షేపం చేయడం తప్పా కేటీఆర్ చేస్తున్నదేమీ లేదని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు ముదిరాజ్ అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కేటీఆర్ రైతుదీక్షలంటూ తిరుగుతున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు గుర్తురాని రైతులు ఇప్పుడు అధికారం పోవడంతో గుర్తుకొచ్చి పోరాటాల పేరుమీద రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. లక్ష రుణమాఫీ అంటూ ఐదు సంవత్సరాలు కాలయాపన చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వం 2లక్షల రుణమాఫీ చేయడాన్ని జీర్ణించుకోలేకపోతుందని అర్థమవుతుందన్నారు. ప్రజలకోసం పోరాటం చేసిన నాయకులకు మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌కుమార్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు!

- అర్ధంతరంగా నిలిచిన చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



పిల్లర్ల దశలో నిలిచిన బ్రిడ్జి నిర్మాణం

షాద్‌నగర్: రైళ్ల రాకపోకలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మాటిమాటికి గేటు వేస్తుండటంతో గంటల తరబడి వాహనాలు ఆగిపోతున్నాయి. ఫలితంగా వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి రైల్వే గేటు వద్ద నిర్మించ తలపెట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం పట్టణ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాతో..

చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అయితే గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయం రూ.95కోట్లు కాగా ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.61.31కోట్లు మంజూరు చేసి పరిపాలన అనుమతులు జారీ చేయడంతో 2023 మే నెలలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు.

కొన్ని నెలలుగా నిలిచిన పనులు..

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో ఆర్అండ్‌బీ, రైల్వే అధికారులు సర్వే నిర్వహించి నిర్మాణ పనులు ప్రారంభించి పిల్లర్లను నిర్మించారు. అయితే ఈ నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో చేసిన డిజైన్‌లో బ్రిడ్జిని నిర్మిస్తే వాహనదారులకు ఇబ్బందులు పడుతారనే ఉద్దేశంతో ప్రస్తుతం ప్రభుత్వం వైజంక్షన్ బ్రిడ్జిని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో గత కొన్ని నెలలుగా నిర్మాణ పనులు ఆగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి అదనంగా రూ.89కోట్లు మంజూరు చేయాలని ఇటీవల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సీఎంను కోరారు.

ఇవీ ఇబ్బందులు..

షాద్‌నగర్ మీదుగా నిత్యం సుమారు ఇరవై రైళ్లు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. పట్టణంలోని చటాన్‌పల్లి, కేశంపేట రోడ్డులో రైల్వే గేట్లు ఉన్నాయి. చటాన్‌పల్లి రైల్వేగేటు మీదుగా చటాన్‌పల్లి, బీవీరావునగర్, బుచ్చిగూడ, కొండన్నగూడ, వెల్జర్ల, సంగెం, కొత్తపేటకు చెందిన వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.



గేటు వేయడంతో నిలిచిన వాహనాలు

అదేవిధంగా వాహనదారులు జాతీయ రహదారి బైపాస్, షాద్‌నగర్ పట్టణంలోని నుంచి వికారాబాద్, పరిగి వెళ్లాలన్నా చటాన్‌పల్లి రైల్వే గేటును దాటి రావాల్సి ఉంటుంది. దీంతో అనునిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలతో ఈ రహదారి ఎంతో రద్దీగా ఉంటుంది. తరచూ గేటు వేస్తుండటంతో వందల సంఖ్యలో వాహనాలు రైల్వేగేటు వద్ద ఆగిపోతున్నాయి. దీంతో అత్యవసర పరిస్థితులలో గేట్లను దాటి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా గేటు తీసిన తర్వాత కూడా వాహనాలు అన్నీ ఒకేసారి ముందుకు కదులుతుండటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది.

చుట్టూ తిరిగి వెళ్తున్నాం



తరచూ రైల్వే గేటు వేస్తుండటంతో అత్యవసర సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. సమయం వృథా కావడంతో పాటు ఖర్చు పెరుగుతోంది.

–వెంకటేశ్, షాద్‌నగర్

గేటు వద్ద నిరీక్షిస్తున్నాం



రైల్వే ఫ్లైఓవర్ కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నాం. పనులు ప్రారంభించినా అర్ధంతరంగా ఆగిపోయాయి. అధికారులు స్పందించి నిర్మాణ పనులు ప్రారంభించి తొందరగా పూర్తిచేయాలి.

– శివకుమార్, షాద్‌నగర్

భూ సర్వేకు దరఖాస్తు చేసుకోండి

తహసీల్దార్ గౌతమ్‌కుమార్



సర్వే నిర్వహిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్, సర్వేయర్ అనంత జలజ తదితరులు

మొయినాబాద్‌రూరల్: వంతెన నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు సర్వే చేసుకోవాలనుకుంటే దరఖాస్తు చేసుకోవాలని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నక్కలపల్లి సమీపంలోని ఈసీ వాగుపై చేపడుతున్న వంతెన నిర్మాణ పనులకు చుట్టుపక్కల పొలాల రైతులు తమ భూముల హద్దు సర్వేకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈసీ వాగు సందర్శించిన వారిలో టీపీసీసీ అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీష్, బీఆర్ఎస్ నాయకులు అంజయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు నిరంజన్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న నాయకులు

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ ముదిరాజ్

షాబాద్: ముదిరాజ్‌లు ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్‌ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో చంద్రశేఖర్‌ను ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. మురాజ్‌లందరూ ఏకతాటిపైకి వచ్చి తమ హక్కుల సాధనకు పోరాటం చేయాలని సూచించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లంతా తమ సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు లింగం, మాసయ్య, గౌరవ అధ్యక్షుడు కూర వెంకటయ్య, నాయకులు మల్లయ్య, శ్రీనివాస్, మల్లేశ్, వెంటకయ్య, చంద్రయ్య, పోచయ్య, సత్యానారాయణ, గౌరీశ్వర్, తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



హైతాబాద్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి, నాయకులు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: మారుమూల గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని హైతాబాద్, పెద్దవేడు, నాన్‌దార్‌ఖాన్‌పేట్, లింగారెడ్డిగూడ గ్రామాల్లో మొత్తం సీఆర్ఆర్ గ్రాండ్ కింద మంజూరైన రూ.55లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్ల పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించడానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేస్తోందన్నారు. సీఆర్ఆర్ గ్రాండ్ నిధులతో గ్రామాల్లో కావాల్సిన వసతులను పూర్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. పార్టీ కార్యకర్తలందరూ ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కలిసి పనిచేస్తేనే విజయ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి వారికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదయ్య, ఎంపీటీలు మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లింగం, శేఖర్‌రెడ్డి, ఖాజామీయా, జనార్ధన్‌రెడ్డి సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, దస్తగిరి, కృష్ణ, యాదయ్య, ప్రవీణ్, శ్రీరాములు, సూర్యగౌడ్, రాఘవేందర్, పద్మారెడ్డి, బురాన్ తదితరులు ఉన్నారు.

అర్చకుడిపై దాడి అమానుషం

కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సంగెరి మల్లేశ్



అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శిస్తున్న సంగెరి మల్లేశ్

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడి అమానుషమని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సంగెరి మల్లేశ్ అన్నారు. మంగళవారం చిలుకూరులో అర్చకుడు రంగరాజన్‌ను ఆయన పరామర్శించారు. ఆయనపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. రామరాజ్యం పేరుతో అరాచకం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. అర్చకుడు రంగరాజన్‌కు, చిలుకూరు బాలాజీ దేవాలయానికి భద్రతను పెంచాలన్నారు. పరామర్శించిన వారిలో మాజీ కో–ఆప్షన్ మెంబర్ మక్బుల్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండు గోపాల్ తదితరులు ఉన్నారు.

నేడు బస్టేషన్ ప్రారంభం

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఏర్పాట్లపై ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: నూతనంగా నిర్మించిన చేవెళ్ల బస్‌స్టేషన్‌ను బుధవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. మండల కేంద్రంలోని పాత బస్‌స్టేషన్ వెనక ఉన్న ఖాళీ స్థలంలో నూతనంగా నిర్మించిన బస్‌స్టేషన్‌ను మంగళవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ అధికారులతో కలిసి బస్‌స్టేషన్‌లో జరుగుతున్న పెండింగ్ పనులను, ఏర్పాట్లను పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ నిధులు రూ.6కోట్లతో నిర్మించిన చేవెళ్ల నూతన బస్‌స్టేషన్ అన్ని పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధమైందన్నారు. బుధవారం బస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డిలు విచ్చేస్తున్నట్లు చెప్పారు. నూతన బస్‌స్టేషన్ అన్ని రకాల సౌకర్యాలతో నిర్మించామన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీలత, డీఈఈ అండాలు, వికారాబాద్ డిపో మేనేజర్ అరుణ, డిపో సిబ్బంది రంజిత్, రామస్వామి, పద్మా, దాస్, ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం అందజేత

కుల్కచర్ల: సంతోషకర సమయమే కాదు.. ఇబ్బందికర సమయాల్లోనూ అండగా నిలుస్తారని నిరూపించారు స్నేహితులు. కుల్కచర్ల జెడ్పీ పాఠశాలలో 1992–93 పదో తరగతి విద్యార్థులు మంగళవారం ఆపదలో ఉన్న స్నేహితుడు మొగులోజీకి సాయం అందజేసి ఆదుకున్నారు. కొన్నిరోజుల నుంచి అనారోగ్యంతో మొగులోజీ ఇబ్బందులకు గురవుతున్నాడనే విషయాన్ని తెలుసుకున్న పదోతరగతి స్నేహితులు నగరంలోని అతని ఇంటికి వెళ్లి రూ.50వేలు సాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్నేహం అంటే సంతోషమే కాకుండా కష్టాల్లో కూడా తోడుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పీరంపల్లి రాజు, మాలె కృష్ణయ్య గౌడ్, శ్రీనివాస్, సత్యం, మల్లేశం, గోపాల్ రెడ్డి, ఆనంద్, రాములు, సుధాకర్, మొగులయ్య పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

శంకర్‌పల్లి: మండలంలోని అంతప్పగూడ గ్రామంలో గల భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవానికి గ్రామంతో పాటు, చుట్టూ పక్కన గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శంకరాచారి, కేదార్‌చారి, ఆలయ ధర్మకర్త నర్సింహాగౌడ్, గ్రామస్తులు బీరయ్య, దశరథ, రాంరెడ్డి, రమేశ్, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్, ఉపాధ్యక్షుడు జైరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న నాయకులు

కుల్కచర్ల: 'మన ఊరు మనబడి' పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుల్కచర్ల మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మన ఊరు మన బడిలో భాగంగా సర్పంచులు, ఎస్ఎంసీ చైర్మన్లు అప్పులు చేసి పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. పనులు నిర్వహించి రెండు సంవత్సరాలు కావొస్తున్నా నేటికీ బిల్లులు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం నామ మాత్రపు నిధులు విడుదల చేసి నిర్వాహకులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో రవిచందర్, చంద్రయ్య, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయంలో పూజలు



ధ్వజస్తంభ పూజ, గణపతి హోమంలో పాల్గొన్న వేదపండితులు, గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని కనకమామిడి సమీపంలో గల సంగమేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం విఘ్నేశ్వరస్వామి పూజ, గణపతి హోమంతో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా దేవాలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో ధ్వజారోహణం, రుద్రాభిషేకం, అగ్నిగుండాలు నిర్వహించారు. అధికంగా భక్తులు రావడంతో దేవాలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. విచ్చేసిన భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు, అన్నదాన ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వేదపండితులు రాజేశ్వర్‌స్వామి, చంద్రశేఖర్‌స్వామి, ఓంప్రకాశ్‌స్వామి, జగదీశ్వర్‌స్వామి, ప్రభాకర్‌స్వామి, గౌరీలతో పాటు తాజా మాజీ సర్పంచ్ పట్లోళ్ల జనార్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పద్మారావు, నర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు రాంరెడ్డి, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శివ పడిపూజ

చేవెళ్ల: మండలంలోని ఎన్కేపల్లి గ్రామంలో మంగళవారం ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శివపడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, శివుడికి ప్రత్యేక అర్చన, అభిషేకాలు, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. శివమాల ధరించిన స్వాములు పెద్దసంఖ్యలో ఈ పడిపూజలో పాల్గొన్నారు. శివపడిపూజతో ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో భక్తిపారవశ్యం సంతరించుకుంది.

భైరంపల్లిలో..

కొందుర్గు: మండలంలోని భైరంపల్లి గ్రామంలో మంగళవారం గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు సత్యనారాయణ, యాదయ్య, యాదవరెడ్డి, నర్సింలు, రామకృష్ణ, రవి, అంజి, వెంకట్రామిరెడ్డి, హరీశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న స్వాములు

టీబీ నివారణకు వైద్య పరీక్షలు అవసరం

కుల్కచర్ల: టీబీ నివారణకు వైద్య పరీక్షలు అవసరమని, ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని మెడికల్ అసిస్టెంట్ శరభలింగం పేర్కొన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఎక్స్‌రే క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ, భవానీసింగ్, శ్రీనివాసులు, రాజు, పుష్ప, రాములమ్మ, భాస్కర్, కృష్ణ, స్వాతి, నర్సింగమ్మ, పార్వతమ్మ, కమలమ్మ, అంజమ్మ, నూర్జహాన్ పాల్గొన్నారు.